సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 14 । జూలై । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,731

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు గురువారం రూ.6,731 పలికింది. కనిష్టం రూ.6,075గా, సరాసరి రూ.6,525 నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.



నేడు జిల్లాస్థాయి పోటీలు

రాష్ట్ర క్రీడా పాఠశాల(స్పోర్ట్స్ స్కూల్)లో 4, 5వ తరగతుల్లో ప్రవేశానికి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించేందుకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులు సిద్ధమయ్యారు. IIలో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల భిక్షాటన



కాంట్రాక్టు కార్మికుల భిక్షాటన

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ గురువారం భిక్షాటన చేపట్టారు. ప్రాజెక్టు లేబర్ గేట్ నుంచి మేడిపల్లి సెంటర్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు మాట్లాడుతూ.. యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 35ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా వేతన ఒప్పందం సకాలంలో అమలు చేయడం లేదన్నారు. యాజమాన్యం కళ్లు తెరిచి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికులకు పోరాటాలు సమ్మెలు కొత్త కాదని, గతంలో కూడా ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్న ఘనత ఇక్కడి కార్మిక వర్గానికి ఉందని, సమ్మె చేయడం అనేది కార్మికుని హక్కు అని, ఎన్టీపీసీ రామగుండంలో సమ్మె జరిగితే యాజమాన్యమే కారణమనే అనే విషయాన్ని గ్రహించాలని డిమాండ్ చేశారు. నిరసనలో యునైటెడ్ ఫోరం నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, ఇజ్జగిరి భూమయ్య, రాజమల్లయ్య, బుచ్చయ్య, ఎం.శంకర్, శ్రీనివాస్, సత్యనారాయణ, సత్యం, జలీల్ పాల్గొన్నారు.

15లోగా కేజీబీవీ దరఖాస్తులు సవరించుకోండి

పెద్దపల్లిరూరల్: కేజీబీవీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 15లోగా సవరణ చేసుకునే అవకాశం కల్పించామని, సద్వినియోగం చేసుకోవాలని డీఈవో డి.మాధవి తెలిపారు. ప్రత్యేక అధికారి, పీజీసీఆర్‌టీ సీఆర్‌టీ పీఈటీల ఖాళీలను తాత్కాలిక, కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తామని, ఆన్‌లైన్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారు తమ వివరాలను సవరించుకోవడానికి ఎడిట్ ఆప్షన్, పోస్ట్ అప్లయిడ్ వివరాల నమోదుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈనెల 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని, సవరణలో సహకారం కోసం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఫోన్ నంబర్ 73866 60584లో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంగీత తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి జిల్లాలో గల బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) కింద పాఠశాలల్లో ఒకటో తరగతి (నాన్ రెసిడెన్షియల్) లో 70 సీట్లు, ఐదో తరగతి (రెసిడెన్షియల్)లో 73 సీట్లు కేటాయించారని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని, లాటరీ పద్ధతిన రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొనారు. వివరాలకు 90101 36407, 99082 61045లో సంప్రదించాలని సూచించారు.

15 నుంచి బీసీలకు రూ.లక్ష సాయం

పెద్దపల్లిరూరల్: బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సహాయం కింద రూ.లక్ష సాయం ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ నుంచి పథకం అమలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పథకంకోసం 5.28లక్షల దరఖాస్తులు అందాయని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ సహాయం చేస్తామని వివరించారు. ఈనెలలో ప్రతి నియోజకవర్గంలో 300 మందికి సాయం అందిస్తామన్నారు. లబ్ధిదారుని వివరాలను నెల రోజుల లోపు అధికారులు యూనిట్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి పాల్గొన్నారు.

16న సివిల్స్ ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష

పెద్దపల్లిరూరల్: ఈనెల 16న సివిల్స్ లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణకు ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్స్ లాంగ్‌టర్మ్‌కు సంబంధించి వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 040–27077929, 7780359322లో సంప్రదించాలని కోరారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామగుండంలో సుమారు రూ.2.4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న మురుగు జలశుద్ధి కేంద్రం (ఎస్టీపీ). ఈ కేంద్రం పనులు 2020 డిసెంబర్‌లో ప్రారంభంకాగా.. ఆగుతూ సాగుతూ పూర్తి దశకు చేరుకున్నాయి. అయినా వినియోగంలోకి రాలేదు. 4ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) కెపాసిటీతో మురుగు జలాలను శుద్ధి చేసేలా.. విదేశీ సాంకేతికతతో పనిచేసేలా ఎస్టీపీని నిర్మించారు. మూడేళ్లు కావస్తున్నా కేంద్రాన్ని వినియోగంలోకి తేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు



ఈచిత్రంలో పైపుల ద్వారా పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలుస్తున్నాయి. గతంలో మల్కాపూర్ వద్ద ఎస్టీపీ కేంద్రం నిర్మించినా.. నిర్వహణలోపంతో నామారూపాలు లేకుండా పోయింది. మల్కాపూర్ శివారులో 40 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మరో ఎస్టీపీ నిర్మాణంతోపాటు దానికి అనుసంధానం చేయడానికి భారీ పైపులతో నగరంలో నాలుగు దిక్కుల యూజీడీ కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. టెక్నికల్ అనుమతి వచ్చినా టెండర్లు పిలువ లేదు. గోదావరిలో నేరుగా మురుగునీరు కలుస్తుండడంపై రామగుండం నగరపాలక సంస్థకు గ్రీన్ ట్రిబ్యునల్, కాలుష్య నియంత్రణ మండలి నోటీసులు ఇచ్చినా నిర్లక్ష్యం వీడటం లేదు.

కాలుష్య గోదారి

నేరుగా నదిలో కలుస్తున్న మురుగునీరు

- విషపూరితంగా మారుతున్న జలాలు
- ఎస్టీపీల నిర్మాణంలో నిర్లక్ష్యం
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- కాలుష్య నియంత్రణపై చర్యలు కరువు



నురుగులతో కలుషితమైన గోదావరి నది

సాక్షి, పెద్దపల్లి: గోదావరి.. ఈ పేరు వినగానే గల గల పారుతున్న నదీమతల్లి గుర్తుకొస్తుంది. పుణ్యస్నానాలు చేసి నమస్కరించాలనిపిస్తుంది. కానీ.. గోదావరిఖని తీరంలో ప్రవహించే గోదావరిని నదిని చూస్తే మాత్రం ముక్కు మూసుకోవాలనిపిస్తుంది. తలెత్తి కూడా చూడాలనిపించదంటే అతిశయోక్తికాదు. మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా నదిలో కలుస్తుండడమే దీనికి కారణం. ప్రతిరోజు సింగరేణి 35 మిలియన్ లీటర్లు, కార్పొరేషన్ 25 మిలియన్ లీటర్లు, బోర్ల ద్వారా మరో 10 మిలియన్ లీటర్ల నీరు మొత్తంగా 70 మిలియన్ లీటర్ల నీటిని ప్రజలు వినియోగిస్తున్నారు. అందులోంచి రోజుకు 40మిలియన్ లీటర్ల మురుగు నీరు నేరుగా గోదావరిలో కలుస్తోంది. దీంతో గోదారి జలాలు కలుషితమై దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఫలితంగా తాగడం అటుంచితే గోదావరిలో స్నానం చేసేందుకూ జనాలు భయపడుతున్నారు. దక్షిణగంగగా పేరుగాంచిన గోదావరి కాలుష్యం కోరల్లో చిక్కుకుని గరళంగా మారుతోంది.

భయపెడుతున్న నురుగు

పొల్యూషన్ బోర్డు నివేదిక ప్రకారం రామగుండం వద్ద గోదావరి 'సీ' గ్రేడ్‌లో ఉంది. అంటే శుద్ధిచేస్తే గాని తాగకూడని పరిస్థితికి చేరుకుందని అర్థం. గోదావరిలో నురుగు సాధారణంగా వచ్చేదా..? లేక ఏదైనా ప్రమాదకర ఫ్యాక్టరీల నుంచి విడుదల వుతున్న వ్యర్థాలతోనా..? అనే విషయాన్ని సంబంధిత అధికారులు ఇప్పటికీ తేల్చకుండా పరీక్షల పేరుతో కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతాల నుంచి..

రామగుండం పారిశ్రామిక ప్రాంతం కావడం.. ఇక్కడ అనేక పరిశ్రమలు ఉండడంతో వాటి నుంచి వెలువడే వ్యర్థపు నీరు నేరుగా మల్కాపూర్ సమీపంలో గోదావరిలో కలుస్తోంది. ఇదే నీటిని ఇంటెక్‌వెల్ వద్దనున్న పంప్‌హౌస్ ద్వారా సింగరేణి యాజమాన్యం నేరుగా కార్మికవాడలకు సరఫరా చేస్తోంది. ఆ నీటిని తాగుతున్న జనం కామెర్లు, దద్దుర్లు, చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. వీటిబారిన పడి ప్రాణాలు పోతున్నవారి సంఖ్య పెరుగుతున్నా.. అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదన్న అపవాదు ఉంది. ఈ విషయమై కాలుష్యనియంత్రణ మండలి ఇంజనీర్ భిక్షంను వివరణ కోరగా గోదావరి నీటిని శుద్ధిచేసిన తరువాత తాగాలని, ప్రతినెలా మొదటి వారంలో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. నేరుగా తాగే అవకాశమే లేదని, శుద్ధిచేసిన తర్వాత తాగడానికి ఇబ్బంది లేదని తెలిపారు.

స్థానిక నాయకులకు పట్టింపులేదు



మల్కాపూర్ సుందిల్లలో మూడు ఎస్టీపీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా పాలకులు, సింగరేణి అధికారుల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక శాఖ వద్ద రూ.90కోట్ల నిధులు ఉన్నా.. నాయకులు విడుదల చేయించడం లేదు. గోదావరి కలుషితం అవుతోందని కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేశాం. గోదావరిని పరిశీలించి వివిధ ప రిశ్రమలకు నోటీసులిచ్చారు. పైప్‌లైన్ల ద్వారా సరఫ రా మూసివేయకుంటే జరిమానా విధిస్తామన్నారు. – మద్దెల దినేష్, సీపీఐ నాయకుడు. గోదావరిఖని

అనారోగ్యం పాలవుతున్నం



కలుషిత నీరు గోదావరిలో కలవటంతో నురుగు లేస్తోంది. ఎస్టీపీలు లేక ప్రజలకు స్వచ్ఛమైన నీరు రావడం లేదు. పారిశ్రామిక ప్రాంత ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. చర్మవ్యాధులు, కిడ్నీ సమస్యలు, జాండీస్, గుండెపోటు వంటి వాటికి గురవుతున్నారు. ఎస్టీపీలు ఏర్పాటు చేసి గోదావరిని కాపాడాలి. – ఇప్పు నర్సింహులు, సప్తగిరికాలనీ

ఉచిత విద్యుత్ తెచ్చిందే కాంగ్రెస్..



మాట్లాడుతున్న విజయరమణారావు

- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించే యత్నాలు
- రైతులకు రుణమాఫీ ఏదీ..?
- టీ పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రైతుల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి పాలనలోనే ఉచిత విద్యుత్ అమలు చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం పార్టీనాయకులతో కలిసి మాట్లాడారు. ఉచిత విద్యుత్‌తోపాటు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దన్నారు. సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణను తొమ్మిదేళ్లుగా పాలిస్తున్న సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం పేరిట మొసలి కన్నీరు కారుస్తున్నారని, రైతులను బ్యాంకులో నిందితులుగా నిలబెడుతున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ కాక వడ్డీభారం పెరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ధాన్యాన్ని కోతలు లేకుండా కొని వెంటనే డబ్బులు జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సర్కార్ మాత్రం రైతుల శ్రమను దోపిడీ చేస్తూ.. మిల్లర్లతో మిలాఖత్ అయ్యారని విమర్శించారు. తూకంలో కోతలు విధించిన సొమ్ము ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అభద్రతాభావంలో పడ్డారని, అందుకే రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాట్లు పడుతున్నారని విమర్శించారు. సీఎం మనుమడు చెప్పినట్లు తెలంగాణలో అనేక పాఠశాలలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. ఎన్ని డ్రామాలు వేసినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బి.సురేశ్‌గౌడ్, అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, మల్లయ్య, శ్రీనివాస్, మనోహర్‌రావు, వేముల రామ్మూర్తి, మహేశ్, రమేశ్, వీరేశం, మస్రత్, పోచాలు, సంతోష్, సారయ్య తదితరులున్నారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి



ప్రశంసపత్రాలు అందిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి



హాజరైన పోలీస్ అధికారులు

- విజబుల్ పోలీసింగ్ తప్పనిసరి
- గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- నేర సమీక్షలో సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: గంజాయి అక్రమ రవాణా, అమ్మకంపై పటిష్టమైన నిఘా ఉంచాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశించారు. గురువారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. స్టేషన్ అధికారులకు హౌస్ మేనేజిమెంట్ తెలిసి ఉండాలని, వారు క్రమశిక్షణతో పనిచేస్తే సిబ్బంది కూడా అదేస్థాయిలో పనిచేస్తారని తెలిపారు. ప్రతిరోజు రోల్‌కాల్ నిర్వహించాలన్నారు. విజబుల్ పోలీసింగ్ ఉండాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. సమస్యలపై స్థానిక కళాకారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతినెలా 30న సివిల్ రైట్స్‌డే, ప్రతిగ్రామంలో కనీసం రెండు సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని తెలిపారు. పెద్దపల్లి జోన్‌లో 270 గ్రామాలు, 50 డివిజన్లలో 3,629, మంచిర్యాల జోన్‌లో 350 గ్రామాలు, 160 వార్డుల్లో 2,623 సీసీ కెమెరాలు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఇబ్బందులు రాకుండా అందుబాటులో ఉన్న సిబ్బందితో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి రూట్ బందోబస్తు చేసుకోవాలన్నారు.

101 మొబైల్ ఫోన్ల అప్పగింత

మొబైల్ ఫోన్లు పోతే 689 సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు ఆధారంగా 101 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించామని సీపీ పేర్కొన్నారు. ఆర్నెళ్లలో పెద్దపల్లి జోన్‌లో 15 కేసుల్లో జైలు శిక్ష పడిందని, 103 కేసుల్లో నిందితులకు జరిమానా, సుల్తానాబాద్, గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో రెండు కేసుల్లో నిందితులకు కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించిందని తెలిపారు. 147 ఆస్తి కేసులు నమోదు కాగా 83 ఛేదించామని, ఏడుగురు నిందితులపై పీడీ యాక్ట్ అమలు చేశామని పేర్కొన్నారు. 3,676 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 6,740 ఈపెట్టీ కేసులు నమోదు చేశామన్నారు. విధినిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు. పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు వైభవ్‌గైక్వాడ్, సుధీర్‌కేకన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్, ఏసీపీలు గిరిప్రసాద్, ఎడ్ల మహేష్, మోహన్, నరేందర్, తిరుపతిరెడ్డి, సదయ్య, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

పోచమ్మకు బోనాలు





ధర్మారం మండలకేంద్రంలో పోచమ్మ ఎలనంపుదు మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత బోనం ఎత్తారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సర్పంచ పుస్కూరి జితేందర్‌రావు, రైతుబంధు సమితి జిల్లాసభ్యుడు పుస్కూరి రామారావు, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, ధర్మపురి ఆలయ కమిటీ సభ్యుడు జైన రాజమౌళి, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.రఫీ పాల్గొన్నారు. – ధర్మారం

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ వ్యతిరేకం



మహాధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే చందర్, నాయకులు

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- కాంగ్రెస్ దిష్టి బొమ్మదహనం

గోదావరిఖని: రైతు సంక్షేమ విధానాలకు కాంగ్రెస్ వ్యతిరేకమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రైతులకు మూడు గంటలు విద్యుత్ చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం స్థానిక రాంమందిర్ సబ్‌స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. చంద్రబాబు శిష్యుడైన రేవంత్‌రెడ్డి రైతులపై కక్షగట్టి వారి జీవితాలను మళ్లీ చీకటిమయం చేయడానికి కాంగ్రెస్‌తో జతకట్టారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, ఉరివేశారు. కార్పొరేషన్ 32వ డివిజన్‌లో ప్రగతి దశాబ్ది ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. డివిజన్‌లోని సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత విధానాలను ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు. రైతులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ఊళ్లోకి వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో రైతు మహాధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు దొంత శ్రీనివాస్, కొమ్ము వేణుగోపాల్, బాల రాజ్‌కుమార్, ఇంజపురి పులేందర్, కుమ్మరి శ్రీనివాస్, జనగామ కవితసరోజినీ, కల్వచర్ల కృష్ణవేణి, పాముకుంట్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య


శ్రీవేణి (ఫైల్)

గోదావరిఖని: భర్త పెట్టే వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన శ్రీవేణి(31), కాకతీయనగర్‌కు చెందిన జోగినిపల్లి విజయ్ తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుటుంబసభ్యులు సర్దిచెబుతున్నారు. ఈ క్రమంలో విజయ్ గురువారం భార్యతో గొడవపడి, ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కాసేపటికే శ్రీవాణి ఉరేసుకుంది. అల్లుడి వేధింపులు తాళలేకనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి గుండ రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై వెంకట్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

రైలులో నుంచి పడి యువకుడి మృతి


ఫైజల్ (ఫైల్)

ఓదెల: కాజీపేట–బల్లార్షా సెక్షన్ల మధ్యలో పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు రైలులో నుంచి కిందపడి, మృతిచెందాడు. రామగుండం జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మదన్నపేట్‌కు చెందిన మహమ్మద్ ఫైజల్(22) పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తల పగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం


సువర్ణ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన శాతవాహన మిత్ర మండలి సభ్యుడు కరుణాకర్‌రావు సోదరి మాదాసు సువర్ణ(55) బుధవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మంచిర్యాలలో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకురాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున ఐ టెక్నీషియన్ కిరణ్ ద్వారా సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. సువర్ణ భర్త రవీందర్‌రావు, కుమారుడు, కోడలు నవీన్ కుమార్–కౌముది, కూతురు, అల్లుడు వందన–నవీన్ కుమార్‌లను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జ్యోతినగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎన్టీపీసీ పోలీసుల వివరాల ప్రకారం.. గౌతమినగర్ రోడ్డుపై గత మార్చిలో కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో రామగుండంకు చెందిన ఐలి శ్రీధర్(40)కు గాయాలయ్యాయి. అప్పటినుంచి ఇంటివద్దే చికిత్స పొందుతున్న అతను గురువారం మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ స్నేహిత్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు జిల్లాస్థాయి పోటీలు

- పెద్దపల్లి ఐటీఐ మైదానంలో నిర్వహణ
- గెలిస్తే రాష్ట్రస్థాయికి ఎంపిక
- సత్తాచాటితే క్రీడా పాఠశాలల్లో ప్రవేశం


మండల స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

సుల్తానాబాద్: రాష్ట్ర క్రీడా పాఠశాల(స్పోర్ట్స్ స్కూల్)లో 4, 5వ తరగతుల్లో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించేందుకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులు సిద్ధమయ్యాయి. ఈ నెల 4, 5వ తేదీల్లో మండల స్థాయి పోటీలు జరిపారు. ఎంపికైన విద్యార్థులను ఈ నెల 14వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిర్వహించే పోటీలకు హాజరుకావాలని అధికారులు ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చారు. పీఈటీలు పలు బృందాలతో ఒకేరోజు పోటీలు జరపాలని నిర్ణయించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ మైదానంలో ఉదయం 9 గంటలకు 9 రకాల పోటీలు నిర్వహించనున్నారు. ఇక్కడ గెలిచిన వారిని ఈ నెల 19న హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నారు. అక్కడ కూడా సత్తాచాటితే క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కల్పించనున్నారు.

వెంట తీసుకురావాల్సినవి..

పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం మండలాల్లో ఎంపికైన క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో మాధవి తెలిపారు. క్రీడాకారులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం(గ్రామ కార్యదర్శి లేదా మున్సిపాలిటీ నుంచి జారీ చేసినది), స్టడీ, కుల సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని డీఎస్‌డీవో సురేష్ సూచించారు.

సకాలంలో హాజరుకావాలి



విద్యార్థులు అన్ని రకాల ధ్రువపత్రాలతో జిల్లాస్థాయి క్రీడా పోటీలకు సకాలంలో హాజరు కావాలి. ఉపాధ్యాయులు పరిశీలించి, అర్హులను లోపలికి పంపించాలి. తొమ్మిది రకాల పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తాం. అక్కడా అర్హత సాధిస్తే క్రీడా పాఠశాలకు ఎంపికవుతారు.
– రమేశ్, పీఈటీ, మద్దికుంట హైస్కూల్



బోనమెత్తిన హిజ్రాలు

రామగుండం: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అంతర్గాం మండలంలోని అక్బర్‌నగర్‌లో వందలాది మంది హిజ్రాలు బోనమెత్తారు. స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా కొండపై ఉన్న పోచమ్మ దేవాలయానికి డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. కాగజ్‌నగర్ నుంచి వరంగల్ మధ్య వివిధ ప్రాంతాల్లో ఉండే హిజ్రాలు బోనాలకు హాజరుకావడంతో రైల్వేస్టేషన్ ఏరియా సందడిగా మారింది. హిజ్రాల ముఖ్య ప్రతినిధులు అర్చన, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

పేషెంట్ల బంధువులకు ప్రత్యేక టైమ్

- గోదావరిఖని జీజీహెచ్‌లో రోగులకు ఇన్‌ఫెక్షన్లు రాకుండా చర్యలు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఇన్‌పేషెంట్లను కలిసేందుకు వారి బంధువుల కోసం ప్రత్యేకంగా టైమ్ కేటాయించినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఇన్‌పేషెంట్లకు ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉండేదుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే రోగులను పరామర్శించడానికి వచ్చేవారు కొబ్బరి బోండాలు తీసుకువచ్చి, ఇష్టం వచ్చినట్లు ఆస్పత్రి ఆవరణలో పడేయవద్దన్నారు. అలాగే పేషెంట్లను డిచ్ఛార్జి చేసిన సందర్భాల్లో వారి కుటుంబసభ్యులు ఆస్పత్రి ఆవరణలో కొబ్బరి కాయలను కొడుతున్నారని, దీంతో పగిలిన కొబ్బరి చిప్పలను తినడానికి పందులు వస్తున్నాయని తెలిపారు. ఈగలు, దోమల బెడద ఎక్కువవుతోందన్నారు. ఇలాంటి వాటిని నివారించడానికి, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పేషెంట్లు, వారి కుటుంబసభ్యులు, బంధువులు సహకరించాలని ఆయన కోరారు.

తెలంగాణ ఉద్యమకారుల సమావేశం


సమావేశమైన ఉద్యమకారులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని తెలంగాణ ఉద్యమకారులు గురువారం కృష్ణానగర్‌లోని ఈదునూరి పర్వతాలు ఇంట్లో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యమంలో పాల్గొని, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గెలుపునకు కృషి చేశామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని, ఎమ్మెల్యే ఉద్యమకారులను గుర్తించి, ఆదుకోవాలని కోరారు. తాము ఎమ్మెల్యేకు వ్యతిరేకం కాదని, తమను స్థానికంగా ఉన్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సైతం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వీరాలాల్, పొన్నం విజయ్, రంగు దుర్గాప్రసాద్, కంది సతీశ్, ఈదునూరి శంకర్, వొల్లాల మల్లేశ్, మడుపు వంశీ, కిశోర్, కుమార్ పాల్గొన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు


రోడ్డుపై దిగబడిన లారీలు

- ఓవర్ లోడ్ కారణంగా ఖమ్మంపల్లి రోడ్డుపై గుంతలు
- తీవ్ర అసౌకర్యంగా ఉందని స్థానికుల ఆవేదన

మంథని: ముత్తారం మండలంలోని ఇసుక క్వారీల సంబంధించిన లారీల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఓవర్ లోడ్ కారణంగా మంథని నుంచి ముత్తారం మండలం ఖమ్మంపల్లికి వెళ్లే రోడ్డుపై ఎక్లాస్‌పూర్ సమీపం నుంచి గోపాల్‌పూల్ వరకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వాహనాలు దిగబడుతున్నాయి. గురువారం రెండు లారీలు దిగబడటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రోజూ ఇదే పరిస్థితి ఉంటోందని, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతు చేసి, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

బల్దియా మియావాకిలు భేష్


మియావాకిని పరిశీలిస్తున్న టీఎస్‌ఎఫ్‌డీసీ జీఎం రవీందర్‌రెడ్డి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో నిర్మించిన మియావాకి (చిట్టడవులు) బాగుందని స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) జనరల్ మేనేజర్ కె.రవీందర్‌రెడ్డి కొనియాడారు. 2021లో ఎన్టీపీసీ, మున్సిపల్ కార్పొరేషన్, టీఎస్ ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో స్థానిక గంగానగర్, గౌతమినగర్‌లలో మియవాకిలను ఏర్పాటు చేశారు. వాటిని మాజీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అర్జున్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. చిట్టడవుల్లో మొక్కలు నాటిన పద్ధతి, ఎదిగిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మియావాకి ఎదిగిన పద్ధతి చాలా బాగుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సంస్థ సీనియర్ మేనేజర్ విశాల్, ఎన్విరాన్‌మెంట్ అధికారి అద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె పంచాయతీ పరిధి శాలపల్లెకు చెందిన బిల్లా భూమయ్య(55) ట్రాలీ ఆటో ఢీకొని, మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. భూమయ్య పని నిమిత్తం గురువారం తన ద్విచక్రవాహనంపై రొంపికుంట గ్రామానికి వెళ్లి, వస్తున్నాడు. శాలపల్లె వద్ద పెంచికల్‌పేట నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ఘటనలో భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం


దుర్గాప్రసాద్ (ఫైల్)

గోదావరిఖని: స్థానిక వినోభానగర్‌కు చెందిన అట్లూరి దుర్గాప్రసాద్(32) ఆత్మహత్య చేసుకున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం అతని భార్య ఇంట్లో లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

కాపర్ ప్లేట్స్ చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

మల్లాపూర్(కోరుట్ల): ముత్యంపేట శివారు నిజాం షుగర్ ఫ్యాక్టరీలో కాపర్ ప్లేట్స్ చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన మనేపల్లి పురుషోత్తం, అబ్దుల్ రహీం, మేకల తరుణ్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. కష్టపడి పనిచేయడం ఇష్టం లేక సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో దొంగతనాలు చేయాలనుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 11న నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఫెన్సింగ్‌ను కట్ చేశారు. లోపలికి వెళ్లి, కాపర్ ప్లేట్లను ఎత్తుకెళ్లారు. ఇలా నాలుగైదు రోజులు ప్లేట్లను తీసుకెళ్లి, ఓ రహస్య ప్రాంతంలో ఉంచారు. గురువారం 80 కిలోల కాపర్ ప్లేట్లను బోధన్‌లో విక్రయించడానికి పురుషోత్తం, తరుణ్‌లు కారులో, రహీం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో ఒబులాపూర్‌లో ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వీరి కారు అనుమానాస్పదంగా కనిపించడంతో పురుషోత్తం, తరుణ్‌లను అదుపులోకి తీసుకొని, విచారించగా నేరం ఒప్పుకున్నారు. వెంటనే బైక్‌పై వచ్చిన రహీంను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కాపర్ ప్లేట్లు, బైక్, కారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై నవీన్‌కుమార్, ఏఎస్సై లచ్చయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, కోటేశ్వర్‌రాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రక్షణపై రాజీ లేకుండా ముందుకుసాగాలి


క్వారీని పరిశీలిస్తున్న డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ సింగ్, అధికారులు

- డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ భూషణ్‌ప్రసాద్ సింగ్

గోదావరిఖని: రక్షణపై రాజీ లేకుండా ముందుకుసాగాలని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ భూషణ్‌ప్రసాద్ సింగ్ అన్నారు. గురువారం ఓసీపీ–1లో పర్యటించి, రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ప్రమాదాల నివారణ కోసం ప్రతిఒక్కరూ అంకితభావంతో పని చేయాలని చెప్పారు. ప్రాజెక్టు సైటాఫీస్‌లో పూలమొక్కలు నాటారు. ఓసీపీలో పనిచేస్తున్న యంత్రాల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎంఎస్ నాగేశ్వర్‌రావు, బానోత్ వెంకన్న, ప్రేమ్‌కుమార్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురవయ్య, ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఏరియా రక్షణ అధికారి వెంకటరమణ, మేనేజర్ ఉదయ్‌హరిజన్ ఉన్నారు.

మొక్కలు నాటిన డీవైడీజీఎంఎస్

గోదావరిఖనిలోని సింగరేణి ఇల్లందు గెస్ట్‌హౌస్ వద్ద డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ సింగ్ గురువారం మొక్కలు నాటారు. 18వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశం కోసం ఆర్జీ–1 ఏరియాకు వచ్చిన ఆయన తిరిగి వెళ్తూ మొక్కలు నాటారు. ఆయన వెంట డీఎంఎస్ ఎస్.నాగేశ్వర్‌రావు, ఆర్ అండ్‌డీ జీఎం సుభానీ, సేఫ్టీ జీఎం గురవయ్య, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకోవాలి


మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన మాట సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ అన్నారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐదో జోన్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులను సీఎం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యంతో మాట్లాడి, వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వేతనాలు పెంచి, 22వ జీవోను గెజిట్ చేసి, అమలు చేయాలన్నారు. లేకపోతే ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

'అదనపు సిబ్బందితో రోడ్డుపాలవుతాం'

- ఆర్జీ–1 ఏరియా ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల ఆవేదన

గోదావరిఖని: అదనపు సెక్యూరిటీ సిబ్బంది నియామకంతో తాము రోడ్డుపాలవుతాయని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్జీ–1 ఏరియాలో మూడు ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలు పని చేస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా 10 నుంచి 15 మందిని మాత్రమే అదనంగా తీసుకోవాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. దీనివల్ల నెలలో సరైన మస్టర్లు దొరక్క ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మొదటి సంస్థలో 41 మంది అవసరం ఉండగా 59 మందిని, రెండో సంస్థలో 33 మందికి గాను 58 మందిని, మూడో సంస్థ ద్వారా 39 మందికి గాను 69 మంది ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని తీసుకున్నారని పేర్కొన్నారు. ఫలితంగా నెలలో 18 నుంచి 20 మస్టర్లకు మించి రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ మరో 10 మందిని అదనంగా తీసుకోవాలని ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. దీనివల్ల మరిన్ని మస్టర్లు తగ్గే అవకాశం ఉందని వాపోతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవానికి తగ్గట్లుగా అదనపు సిబ్బంది ఉండేలా చూడాలని కోరుతున్నారు.

ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్ తనిఖీ


డీఎంఎస్‌ను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌ను ఎలక్ట్రికల్ డీఎంఎస్ బిశ్వంతబెహరా గురువారం సందర్శించారు. 33/132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వకీల్‌పల్లి వరకు ఉన్న ఓవర్ హెడ్ లైన్‌ను తనిఖీ చేసి, రక్షణ, రెగ్యులేషన్స్‌పై ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్స్, ఎలక్ట్రీషియన్లకు సూచనలు చేశారు. అంతకుముందు అధికారులు ఆయనను సన్మానించారు. యాక్టింగ్ ఎస్‌వోటూ జీఎం రవీందర్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఎస్ఈ రాంరెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ రామారావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ పద్మ

గోదావరిఖని: వర్షాకాలంలో సీజనల్ వాధులపై అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఆరోగ్య అధికారి డాక్టర్ పద్మ అన్నారు. గురువారం ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే సకాలంలో గుర్తించి, వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ డి.రమేశ్, సేఫ్టీ ఆఫీసర్ భరత్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ సురేందర్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నలుగురు దొంగల అరెస్టు


దొంగల అరెస్టు చూపుతున్న సీఐ జగదీశ్

సుల్తానాబాద్ రూరల్: నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ జగదీశ్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. సుల్తానాబాద్ పట్టణంలోని మార్కెండేయకాలనీలో రెండు కిరాణా దుకాణాల్లో ఇటీవల చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వేముల చంద్రప్రకాశ్, ఏర్ల చైతన్య(మార్కండేయ కాలనీ), బుడిమ ఓదెలు(గడిమహల్), ఒజ్జ రణదీప్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరుపగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. మరో ఇద్దరు కోట అభిలాష్, వనపర్తి వెంకటేశ్ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. దొంగల వద్ద నుంచి బైక్ స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై విజేందర్, ఏఎస్సై తిరుపతి, హెచ్‌సీ తిరుపతిరావు, కానిస్టేబుళ్లు తిరుపతినాయక్, కిరణ్, శ్రీనివాస్‌లను అభినందించారు.

కొండగట్టు చోరీలో ప్రధాన నిందితుడి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

మల్యాల(చొప్పదండి): కొండగట్టు దేవస్థానంలో గత ఫిబ్రవరిలో జరిగిన దొంగతనం కేసులో ప్రధాన నిందితుడు రామారావు జాదవ్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ప్రకాశ్ తెలిపారు. మల్యాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. చోరీ చేసిన జాదవ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన మల్యాల సీఐ కోటేశ్వర్, మల్యాల ఎస్సై అశోక్, కొడిమ్యాల ఎస్సై వెంకట్రావులను డీఎస్పీ అభినందించారు.